
తెల్లాల్చీ, పైజామా–సర్దుకుంటూ గిరజాల జుట్టు సవరించుకుంటూ, ముక్కుమీద నుంచి ఏ మాత్రం జారిపోని గోల్డ్ ఫ్రేమ్ కళ్ళజోడు సర్దుకోవటం వో మేనరిజమ్‌గా, నేను, యింటి వాకిట అడుగు పెట్టాను...వాహనం దిగి!

# దగాపడ్డ....

## ఎమ్.డి.సౌజన్య



మా బయటి తలుపుమీద– 'జటాయువు' కథ–నాటక–నవలా రచయిత'– అనే నేమ్ ప్లేట్ మీద– నల్లటి బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్ల అక్షరాలు– కారు చీకటిలో కాంతిరేఖలా మెరిసిపోతున్నాయ్!

ముద్దొచ్చే నా పేరు కంటే, 'జటాయువు' అన్న నా కలం పేరంటే, నాకెంతో ఇష్టం!

సైకిలు గంట కొట్టడంతో, నా రాకను గమనించినట్టుంది మా శ్రీమతి– 'వాణి'

"కేరియర్‌తో మధ్యాహ్నం ఆఫీసుకు భోజనం తెప్పించుకున్నారుగా... టిఫిన్ క్యారేజి... ఏది?" అంది.

మాంచి కథ రాద్దామని వారం నుంచి ప్లాటు కుదరక, కుదిరింది నచ్చక, నచ్చింది కాగితంమీద పెట్టలేక నానా గడ్డి గరుస్తున్నాను.

అసలే మూడ్ పోతుందేమోనని బెంగగా ఉన్న నాకు, శ్రీమతి ప్రశ్న యక్షప్రశ్నగా, సమాధానంలేని శేష ప్రశ్నగా తోచింది!

"కేరియర్‌తో భోజనం తెప్పించుకోవట

వేమిటి? ఎవరు తెప్పించారు?... ఎవరు తెచ్చారు?'' అన్నారు కంగారుగా.

''ఎవరో మీ బిల్ సెక్షనుకు కొత్తగా వచ్చాట్ట. పేరు...'అయోమయం' అన్నాడు! అదేం పేరు? అంటూ ఆరాలడిగాను! వాడు లేకలేక కలిగిన సంతానమని, వాడి తల్లి దండ్రులు వాడికి పిచ్చిపేరు పెట్టారట! వాళ్లమ్మ మాత్రం వాడిని బుజ్జబ్బాయి... బుజ్జబ్బాయి అని...'' అని చెబుతోంది వాణి.

''ఇక, అసలు సంగతి చెప్పు! 'అయోమయం' అని పేరున్న ప్యూను, మా ఆఫీసులో లేడు! టిఫినుతో పాటు భోజనం కూడా పట్టుకెళ్లాడా! రాస్కెల్! వాడి కెంత ధైర్యం? ఇంతకీ ఏం కూర, ఏం పచ్చడి?'' అడిగాను మధ్యాహ్నం భోజనం లేనందుకు కడుపు మండిపోతుండగా. టిఫిను కూడా పోయిందనే బాధతో యీ కడుపు మంట మరింత ఎక్కువయ్యింది!!

## దగా పడ్డ...

''మీ కిష్టమని గుత్తివంకాయ కూర, మజ్జిగపులుసు, దోస ఆవకాయ పచ్చడి, వడియాలు, గడ్డ పెరుగు'' చెబుతోంది మా ఆవిడ నోరూరించేట్టు.

''అబ్బబ్బా!! వర్ణన చాలుగాని ఆపు!! మనిషి ఎలాఉన్నాడు!! రాస్కెల్ పోలీసులకి కంప్లయింట్ యిచ్చి వాడి పని పట్టాలి. వాడిని నా కథలో విలన్‌గా చిత్రించాలి!'' అన్నాను కసిగా.

రచయిత అయినప్పటి నుంచి నన్ను బాధ పెట్టిన వాళ్లను, ఏడ్పించిన వాళ్లను, నా కథల్లో పాత్రల్నిచేసి, వాళ్లను రాచి రంపాన పెట్టి, పీకి పాకాన పెడుతున్నా! మా డిపార్ట్‌మెంట్ ఆఫీసరు ఒకసారి, డ్రాఫ్ట్సులో గ్రామరు తప్పులు పట్టుకొని మెమో యిచ్చినందుకు వాడిని, 'గ్రామర్...పిల్లి' అనేకథలో అఖిలాంధ్ర పాఠకుల నవ్వుకు గురిచేశాను! నా రచనా వ్యాసంగం ఒక్కోసారి యిలాంటి అమాం బాపతు పనులకో సాధనంగా ఉపయోగ పడటం నాకెంతో ఆనందంగా, గర్వంగా ఉంటుంది.


''ఆ ప్యూనెలా ఉన్నాడు!?'' మళ్ళీ అడిగాను మా ఆవిణ్ణి.

''నల్లగా, ఆరడుగుల ఎత్తు, బిస్నీషర్ట్సూ, ప్యాంటూ, చూపరులను యిట్టే ఆకట్టుకునే మొహం, ఆ మొహం మీద నుంచి జారే ఉంగరాల జుట్టు, చేతికి ఉమేగా వాచి! సైకిలు బెల్లు ఎంతో మధురంగా కొట్టాడు. వంశీమోహనుని మురళీరావంలా అనిపించింది. టిఫినులో భోజనం పెట్టి యివ్వగానే సైకిల్ మీద దూరంగా ఎక్కడికో అనంత తీరాలకు వెళ్ళిపోయాడు!'' చెప్పింది మా ఆవిడ.

వళ్ళు మండిపోయింది నాకు. టిఫిను పోయినందుకు కాదు, నవలలో హీరో ని


★★★ నిష్ప్రయోజనకరమైన ''భ్రమల ప్రపంచం''లో పతితలను కాసేపు పరిభ్రమింపజేసి, మభ్యపెట్టకుండ — ప్రతివారు జీవితంలో పురోగమించటానికి ఆవశ్యకమైన ఆయుధ సంపత్తిని బహూకరించే

రావి శ్రీమన్నారాయణ, M.A., నవల




"యువరాజు"




★★★ ''యువరాజు'' నవల (అసాధారణమైన ఫాయిల్ గెటప్‌తో, బపుండు ఎడిషన్) ముందు రు. 10/- M.O. చేస్తే, రు. 20/- లకు V.P. గా పంపిస్తాము.

VARALAKSHMI PUBLICATIONS (Phone: 445232), 11-2nd St., Dr.B.N.Reddy Road, T. Nagar, MADRAS-600 017.

రావి శ్రీమన్నారాయణ, M.A., నిజమైన మాస్టర్ పీస్ "యువరాజు"

ర్ణించినట్టు వర్ణించి చెబుతుంటే! ఆ దొంగ వెధవను, నవలా ఫక్కీలో అభివర్ణించటమూ, అనుకుని—

"అబ్బబ్బా! వాడి పేరేంచెప్పాడు? నన్ను గురించి, మా సెక్షన్ గురించి ఏంచెప్పాడు!? ఆ టిఫిను ఆ దొంగ చేతికిద్దామని నీకు నమ్మకం కలగటానికి, ఏం చెప్పాడు? ఆ వివరాలు చెప్పు?" అన్నాను విసుగ్గా.

"బిల్ సెక్షన్‌లో పనిచేసే 'జటాయువు' పంపారమ్మా! ఉదయం భోజనం చేయలేదట అయ్యగారు. టిఫిన్‌తో భోజనం తెమ్మన్నారు! నన్ను మీ రెరుగరు సెక్షనుకు కొత్తగా వచ్చాను. నా పేరు 'అయోమయం!' అయ్య గారి సెక్షనులో పనిచేసే రామనాథయ్యగారింట నుంచీ టిఫిను తెస్తున్నా!" అని రామనాథయ్య గారి క్యారియర్ చూపాడు. ఇక నమ్మక తప్ప లేదు!" అంది వాణి.

"అయితే వాడు... నా కలం పేరూ తెలుసుకునే ఇంటికి వచ్చాడన్న మాట... ఐ సీ...!!" అన్నాను పైకి కోపంగా. కాని లోలోపల ఒక దొంగ వెధవకు నా కలం పేరు 'జటాయువు' అని తెలియటం నిజంగా వింత విచిత్రం!! అనిపించింది.

"అయినా వాణీ! ఎవడో కొత్త వెధవ గదా? వాణ్ణి, వాడి మాటల తీరుని కాస్త విశ్లేషించి, తర్కించి వాడి శైలి, భాష, అర్థం చేసుకుని విమర్శనాత్మక దృష్టితో వాడొకవేళ దొంగేనేమోనన్న అనుమానం రాలేదా!?" అని చివాట్లు వేశాను.

ఇంతలో మా ఆవిడను ఒక కథకు పాత్రను చేసి, ఆమె తెలివి తక్కువతనాన్ని హైలైట్ చేస్తూ, లైట్ హ్యూమర్ వీన్‌లో ఒక కథ వ్రాసి, ఆడంగుల్ని జాగర్తగా వుండమని హెచ్చరిస్తూ ఎడ్యుకేట్ చేసే కథ వ్రాస్తే ఉభయతారకంగా కొంత పేరు, కొంతడబ్బు!! నైస్ అయిడియా అనుకున్నాను.

"కొత్త ప్లాట్ దొరికింది. పోతేపోయింది టిఫిను!!" అనిపించింది.

మనిషి ఎందుకు మోసపోతాడు?

మోసగింపబడే వాడికంటే, మోసం చేసే వాడు తెలివిగలవాడైతే...!!

మోసం జరుగుతున్నట్టు, మోసంజరుగు తున్నంతసేపూ తెలియకుండా వుండే ఒక విధమైన తెరదించినట్టు అంతా డ్రమెటిక్‌గా జరిగిపోవాలి! మోసం చేసేవాడికి తానెన్ను కున్న విక్టిమ్...ఏ అవసరమో, బలహీనతో అసహాయతో ఆలంబన కావాలి!! సమయం కనిపెట్టి మెత్తగా దొంగ యింటికి కన్నం వేసినట్టు... ఆ వీక్ పాయింట్‌ని... ఆ వీక్ మొమెంటులో ఎక్స్ప్లాయిట్ చేయాలి! దిక్కుమాలిన ఫార్ములా!! అయినా విక్టిమ్ తెలివిగలవాడైతే ఆ ఫార్ములా పప్పులు ఉడకవు గదా!?" విమర్శించుకున్నాను!

ఇంతలో "బాబా బాబా బ్లాక్ షీప్... హ్యావ్ యూ ఎనీ ఊల్!" అంటూ పాడు కుంటూ ఇంట్లోకి ప్రవేశించాడు మా తిక్కన!! మా వంశాంకురం!!

కథారచయితగా సాహిత్యపు వాసనలు వెదజల్లాలని, అచ్చతెలుగు మడికారపు యింపు సొంపులమీద ప్రేమతో, మా వాడికి 'తిక్కన' అని పేరుపెట్టి, ఇంగ్లీషు మీడియమ్ స్కూల్లో చేర్చా! ఖర్మ! ఈ మధ్య తెలుగు లోనూ సున్నా మార్కులు సంపాదిస్తున్నాడు!

"ఏదిరా సైకిల్ లోపలికి తేలేదేం!?" అన్నాను యింగ్లీషులో.

మా తిక్కన చదివే 'ఆల్ సెయింట్స్'లో విధిగా యింగ్లీషులో మాట్లాడాలట. అందుకని మా వాడు స్కూలు వదలినా యింగ్లీషులో మాట్లాడతాడు! అనర్గళంగా, ధారాళంగా, క్రియలేకుండా మాట్లాడతాడు.

నేనడిగిన 'సైకిల్' సంగతిలో ధ్వనించిన తీవ్రత అర్థం చేసుకున్నట్టున్నాడు. హిచ్‌కాక్ చిత్రంలో భయంకర దృశ్యాన్ని చూసినట్టు చూస్తూ నాతో—

"అదేమిటి డాడీ! మీరు మా 'ఆల్ సెయింట్స్' కాన్వెంట్ ప్రిన్సిపాల్‌కు ఫోనుచేసి, సైకిల్ రిపేరు చేయించటానికి మనిషిని పంపుతామని పంపారుగా" అన్నాడు.

నా తల గిర్రున తిరిగింది.


"కొంపతీసి, యివ్వాళ ఏప్రిల్ ఫూల్ కాదు గదా?" అనిపించింది, ప్రథమాలోచనలో.


కాంపిటీషనులో ప్రథమ బహుమతి వస్తుందనుకున్న కథ– సాధారణ ప్రచురణకు కూడా నోచుకోక తిరిగి వచ్చినప్పటి కంటే కోటిరెట్లు అధికమైన బాధది.

"నేను మీ కాన్వెంట్‌కి ఫోనుచేసి సైకిల్ రిపేరు సంగతిచెప్పి మనిషిని పంపుతున్నాను. నీ సైకిల్ పంపమన్నానా?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఔను డాడీ, ఇంటర్వల్‌కు ముందు, మా ప్రిన్సిపాల్‌గారికి మీ దగ్గరనుంచి ఫోనొచ్చింది. నేను క్లాసులో వుంటే ఆయనే పిలిపించారు. మీరేగా నాతో మాట్లాడి, సైకిల్ వెంటనే పంపు. మనిషిని పంపు తున్నాను. ఇతను మా డిపార్ట్‌మెంట్ కొత్త ప్యూను. మనింటి నుంచి నాకోసం టిఫిన్ క్యారేజి తెస్తున్నాడు. అది తెచ్చిన మనిషికి నీ సైకిల్ యిచ్చిపంపు! అంటూ చెప్పారు." అన్నాడు మా తిక్కన.

"అయితే ఇక్కడ టిఫిను భోజనంతోసహా కాజేసి, అది చూపటానికి వాడుకొని... అను మానం రాకుండా ఉండేందుకు నేను ఫోను చేసినట్లు ఫోనుచేసి నా గొంతు అనుకరించి, ప్రిన్సిపాల్‌తో మాట్లాడి... మై గాడ్!...






ఆ దొంగ వెధవకు నా కలం పేరు తెలుసు. మా తిక్కన 'ఆల్ సెయింట్స్'లో చదువుతున్న విషయం, నేను పనిచేస్తున్న సెక్షను, మా వాడికి సైకిలుందని, అది రిపేరు చేయించవలసిన అవసరం వున్న సంగతి... విన్ని వివరాలు తెలుసు!? మోసం చేయటానికి విన్ని వి వ రా లు తెలుసుకున్నాడు! పైగా ఇక్కడ మా వాణిని మోసం చేసి, టిఫిను భోజనంతో సహా కాజేసి, ఆ టిఫిను క్యారేజిని చూపి మా తిక్కనను నమ్మించటానికి ప్రయత్నించాడు!'' అంటూ జరిగిన మోసాన్ని విశ్లేషిస్తున్నాను.

మా తిక్కన తల వంచుకొని నిలబడ్డాడు, మోసం జరిగిందని తెలుసుకోగానే !

వాణ్ణలా చూస్తుంటే ఓ ప్రక్క తిక్క రేగుతోంది. మరో ప్రక్క జాలివేస్తోంది!!

''ఏరా! ప్యూను మీ కా న్వెం ట్ ప్రిన్సిపాల్‌తో నీతో తెలుగులో మాట్లాడాడా ఇంగ్లీషులో మాట్లాడాడా!?'' అడిగాను ఏదో 'క్లూ' దొరికినట్లు.

''తెలుగులోనే మాట్లాడాడు!'' చెప్పాడు తిక్కన.

''ప్యూను ఇంగ్లీషులో మాట్లాడుతాడా!? పైగా తెలివిగా దొంగతనం చేయటానికి వచ్చినవాడు!'' అనుకున్నాను.

''వాణి... టిఫిన్ కేరియర్!! తిక్కన... ఏకంగా సైకిలు...!! ఛీ! ఛీ! ఎలా బ్రతుకుతార్రా ఈ లోకంలో. ఇద్దరూ కట్టకట్టుకొని మూసీనదిలోకి దిగండి!'' అందామనుకున్నాను.

ఆ నదిలో ఎప్పుడూ నీళ్ళుండవన్న సంగతి గుర్తొచ్చింది.

''అఘోరించావుగాని, ఆ ప్రక్క వీధేగా ఇన్‌స్పెక్టరు ఆనందరావుగారిది. ఆయన ఇంట్లో వున్నారేమో చూసిరా. పోలీసు

# దగా పడ్డ...

కంప్లయింట్ యిద్దాం!'' అన్నాను పైకి.

తిక్కన అక్కడి నుంచి వెంటనే నిష్క్రమించాడు. ఇక మా వాణి ఎదురుగా ఉంది.

''అయినా...వాణీ! అణుయుగంలో వుండే మనిషి తన చుట్టూ వుండే పరిసరాల్ని, మనుషుల్ని... వాళ్ళు యప్రోచ్ కాగానే వాళ్ళ మనోగత భావాల్ని వాళ్ళ మాటల, చేష్టల వెనక వుండే అంతర్యాన్ని, ఆలోచనా ధోరణిని సిక్స్త్ సెన్స్ ఉపయోగించి కనిపెట్టాలి!'' అంటూ గీతోపదేశం చేస్తున్నాను.

ఇం త లో ''నమస్తే సార్ !'' అన్న తియ్యటి కంఠం విని, వాగ్ధోరణిని ఆపాను.

ఎదురుగా ఎర్రగా గుండ్రటి మొహం, సన్నటి నాసిక, విశాలమైన కళ్ళు, వంకు వంకుల కురులు, భుజంమీద నుంచి పడగ విప్పిన పాములా జారినట్లు మెరుస్తోంది జడ! కళ్ళజోడు పెట్టుకోవటంవలన అనుకుంటా, ముఖంలో గంభీరత, పెందుతనం కనిపిస్తున్నాయి. అందమైన రంగుల బాపు బొమ్మ!

''అయామ్ ఫ్రమ్ తిరుపతి. అయిమీన్ వెంకటేశ్వర యూనివర్సిటీలో రి సె ర్చ్ స్కాలర్‌ని. తెలుగు కథానికలో సామాజిక స్పృహ,అనే విషయంమీద రిసెర్చిచేస్తున్నాను. ప్రముఖ కథ, నవల, నాటక ర చ యి త 'జటాయువు' మీరేకద సార్!'' అంది.

ఎంతో తియ్యగా అడిగింది. ఆ గొంతులో కోటిరాగాలు. నిజంగా సరస్వతీ సాక్షాత్కారం అయిందా అనిపించింది.

''ప్లీజ్ కూర్చోండి !'' అన్నాను, అంత వరకూ ఆమాట అనవందుకు నొచ్చుకుంటూ.

''ఎవరి వండుకోతి !'' అన్నట్టు కొర కొర చూపులతో మా ఆవిడ జెలసీగా చూస్తున్నట్టు తోచి—

''వాణీ ! రెండు బ్రూకాఫీ...అర్జంట్!'' అన్నాను ఆవిడను లోపలికి పంపుతూ.

''నా పేరు శారద ! నా రి సె ర్చ్ మెటీరియల్‌లో ప్రముఖ ఆధునిక రచయితల్లో ప్రముఖుల పేర్లన్నీ కాకుండా, వాళ్ళల్లో తల మానికంగా ఎన్నుకోదగినవాళ్ళ పేర్లు మాత్రమే తెలుసుకొని,వాళ్ళను యింటర్వ్యూ చేస్తున్నాను పర్సనల్‌గా ! మీ పేరు మా ప్రొఫెసర్ గారే చెప్పారు. మీ రచనల్లో ఉండే సామాజిక స్పృహను గురించి ఆ మధ్య ఒక లెక్చర్ యిస్తూ వివరించారు. ఈమధ్య మీ 'సిక్స్త్ సెన్స్' అనే కథ ఎంతో బాగుంది ! ఆ...బై దిబై... మీ కథల కటింగ్స్ వుంటే యివ్వండి ఏమైనా, ఎన్నయినా పర్వాలేదు నాలుగయిదు వారాల్లో రిజిష్టర్‌పోస్టులో పంపుతాను ! ఆ... ఇక యింటర్వ్యూ ! మీ కథలకు ప్రేరణ... ఐ ... మీన్, మీకు కథలెందుకు ... ఎలా వ్రాయాలనిపించింది ?'' గడగడా అడిగేసింది, చదువుల సరస్వతి.

''పాత మేగజైన్స్ - రష్యన్, జర్మన్, ఫ్రెంచ్, ఇంగ్లీషు కథలు ... నా కథలకు మూలం'' అని చెప్పమని నా అంతరాత్మ ఘోషిస్తోంది.

కాని యింత ఘోరమైన నిజం ఎలా చెప్పగలను ? పైగా... వికర్ సెక్స్ ... య ం గ్ ... ఛార్మింగ్ వు మ న్ తో ! మొహమాటం, అంతకంటే ఆత్మగౌరవం అడ్డొచ్చి !

''మా పూర్వీకుల్లో చాలామంది ఆసు కవిత్వంతోపాటు అష్టావధాన, శతావధానాలు చేసిన వాళ్ళే! అలా కవి పండిత వంశంలో పుట్టినవాణ్ణి కావటం ఒక కారణం అనుకుంటాను!'' అన్నాను.

మా పూర్వీకుల పేర్లేమయినా కొంపతీసి వాకబు చేయదు కదా!? అనే భయం ఓ ప్రక్క నా మనసులో పిచ్చి గుర్రంలా పీకుతోంది.

''మీ కథలకు వస్తువునెలా స్వీకరిస్తారు?'' అడిగింది శారద.

''నిత్య జీవితంలో చూసినవి, నన్ను బాగా కదిలించినవి, నా మనో ఫలకంమీద బాగా ముద్ర వేసినవి, ఇక అవి వ్రాయకపోతే బతకలేను అనే భావోద్రేకం కలిగినపుడే నేను కాగితాలమీద కూర్చుకుంటాను'' అన్నాను.

చదువుల సరస్వతి నే చెప్పిన వివరాలన్నీ

షార్ట్‌హాండ్‌కంటే వేగంగానే లాంగ్‌హాండ్‌లో వ్రాసుకుంటోంది!

"ఏఏ రచయితలంటే, ఏఏ రచనలంటే మీకెక్కువ యిష్టం?" మళ్ళీ ప్రశ్న.

"సామాజిక దృక్పథం, వ్యక్తి వికాసం, మానవతా వాదం, వ్యక్తి స్వాతంత్ర్యం కోరే రచయిత లందరూ నాకిష్టులే! రష్యన్ 'టాల్‌స్టాయ్', 'చెహోవ్', 'గోర్కీ', ఫ్రెంచ్ 'మపాసా', 'ఇబ్సన్', 'ఎమిలీజోలా', అమెరికా 'ఓ హెన్రీ', 'టెనిగీ విలియమ్స్', 'ఎమర్సన్' 'థోరో' ఇంగ్లీషు 'సోమర్ సెట్ మామ్' 'కిప్లింగ్' 'హార్డీ' పాతరచయితల్లో 'ప్లాటో' 'అరిస్టాటిల్' ఆధునిక తత్వవేత్తల్లో 'బెట్రాండ్ రస్సెల్' 'ఆర్థర్ ఎమిల్లర్' 'కారల్ మార్క్స్' 'లెనిన్' ఇలా చాలామంది ఉన్నారు" అన్నాను.

నిజానికి వీళ్ళను గురించి వినటమేగాని వీళ్ళ రచనలు నేను చదివిందేలేదు! అసలు నేను చెప్పినట్లు వాళ్ళు ఆయా దేశాలవాళ్ళు అవునో కాదో భగవంతుడికే తెలియాలి!!

ఇంతలో మా వాణి రెండు బ్రూ కాఫీ కప్పులు తెచ్చిపెట్టింది.

"వాణీ! వీరికి నా కథల కటింగ్స్ ఉండే రెండు ఫైళ్ళు తెచ్చిపెట్టు!! శారదగారూ! ఈమె నా బెటర్ హాఫ్!" అన్నాను చిరు పరిచయంతో ముగించి.

మా ఆవిడ మళ్ళీ నిష్క్రమించగానే... ఇంటర్వ్యూ మళ్ళీ సాగింది.

"కమిటెడ్ రైటింగ్...ఇజమ్స్...మెలో డ్రామ్... థర్డ్ వరల్డ్... అనేవాటి మీద మీ అభిప్రాయం" అడిగింది శారద.

పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్టు బాధపడ్డాను. అయినా నా అజ్ఞానాన్ని తెలియ నివ్వకుండా ఓ చిరునవ్వుతో "అంత పెద్ద విషయాలు చర్చించలేను! ఏదోచిన్నవాణ్ణి!" అన్నాను చిరునవ్వుతో నా బలహీనతని కప్పిపుచ్చుకుంటూ.

నేను చెప్పిన ప్రతిమాటా వేదంలా వ్రాసుకుంది శారద. నాకెందుకో బ్రహ్మానందంగా ఉంది.

"సార్ ఓ చిన్న రిక్వెస్ట్! ప్లీజ్ కాదనకండి! నేనే స్వయంగా 'ఆంధ్రుల అభిమాన రచయిత(త్రు)లు' అనే పుస్తకం ప్రచురిస్తున్నాను. అందులో మీ ఫొటో వేయటానికి ఒకకాపీ దయచేయండి!" అంది.

కథలు వ్రాయటం మొదలు పెట్టిన నాటినుంచీ రెండు కాపీలు ప్యాస్‌పోర్టు సైజు ఫోటోలు నా పాకెట్‌లో ఎప్పుడూ రెడీగానే ఉంటాయి! ఏవైనా బహుమతులొస్తే... అవసరంకదా! వినయంగా సమర్పించు కున్నాను.

"ఇక సెలవు తీసుకుంటాను! బైదిబై ...పూర్వ ప్రచురణ ధరకింద, పుస్తకం పది రూపాయలు చొప్పున ... పది రశీదులున్న పుస్తకం ఒకటిస్తాను! నేను పుస్తకాలు పది పంపగానే మీరు డబ్బు డ్రాఫ్టు పంపండి!" అంది శారద.

ఇంతలో మా ఆవిడ కథల కటింగ్సున్న ఫైళ్లు రెండుతెచ్చి అందించింది.

"మీరింత సాహిత్యసేవ చేస్తుంటే ... ఒకటేం భాగ్యం! నాలుగివ్వండి! ప్లీజ్ ... డబ్బు కూడా తీసికెళ్ళండి!" అంటూ నాలుగు వందనోట్లు అందించాను.

"ఇలాటి సహృదయులు – సాహితీ బాంధవులు...నిజంగా అరుదు. థాంక్యూసార్ ... వస్తాను! మీ కథలు వీలైనంత త్వరలో రిజిష్టర్ పోస్టులో పంపుతాను! ఇదిగో నా విజిటింగ్ కార్డుమీద నా అడ్రసుంది నమస్తే!" అంటూ నిష్క్రమించింది. నా మనస్సు బాధగా మూలిగింది.

ఏదో తియ్యటి రంగుల కల చెదిరినట్లు, వరమివ్వబోయే వేల్పు మాయ మయినట్టు అనుభూతి కలగింది.

ఇంతలో మా తిక్కన వచ్చి "డాడీ!" అంటేకాని నేను, ఆ సుషుప్త జగత్తునుండి తిరిగి యీ వాస్తవ జగత్తులోకి రాలేక పోయాను. అయినా వాడి మాట వినిపించందే!

అఖిలాంధ్ర రచయితల్లో అగ్రగణ్య శ్రేణికి చెందిన రచయితలుగా నా పేరు ... రిసెర్చి స్కాలర్సు వ్రాసే థీసెస్‌లో మైగాడ్! — అనుకున్నాను ఆనందంగా ఊహించుకుంటూ.

టిఫిన్– సైకిలు పోయిన సంగతి మరచే పోయాను అలా ఎంతసేపు కూర్చొన్నానో! ఈవినింగ్ ఎడిషన్ పేపర్ కిటికీలోనుంచి నా ముందు పడితే తెరిచి చూశాను! ఓవార్త ప్రథమ పేజీలోనే ఉంది ఫొటోతోసహా! అదిరిపడ్డాను— "రిసెర్చ్ స్కాలర్ నంటూ రచయితల్ని రచయిత్రుల్ని మోసగించి డబ్బు కాజేస్తున్న యువతి!" అనే శీర్షిక అది.

## కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీపి పంపాలి.

★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి. అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలాబిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది. దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

— సం॥